APTEL/26/A4269

# అనంత సూర్య

www.ananthasurya.com తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి ఎడిటర్ : సి హరికృష్ణ మంగళవారం 21, జూలై 2026 సంపుటి: 01 సంచిక :54 పేజీలు : 04 వెల: 2-00/-



## ఎల్‌టీసీజీ పన్ను కొనసాగింపు..

▪ రద్దు చేసే యోచన లేదన్న కేంద్రం

న్యూఢిల్లీ, జులై 20 : షేర్ మార్కెట్ ఇన్వెస్టర్లకు కేంద్ర ప్రభుత్వం కీలక స్పష్టత ఇచ్చింది. లిస్టెడ్ ఈక్విటీ షేర్లు, ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్లపై అమలులో ఉన్న లాంగ్ టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ (ఎల్‌టీసీజీ) పన్నును ప్రస్తుతం రద్దు చేసే ప్రతిపాదన ఏదీ లేదని కేంద్రం ప్రకటించింది. రిటైల్, దేశీయ పెట్టుబడిదారులకు ఈ పన్ను నుంచి మినహాయింపు ఇవ్వడం లేదా పూర్తిగా ఉపసంహరించుకోవడం వంటి అంశాలు ప్రభుత్వ పరిశీలనలో లేవని లోక్‌సభలో స్పష్టం చేసింది. లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇస్తూ.. వార్షిక బడ్జెట్ ప్రక్రియలో భాగంగా దేశ ఆర్థిక పరిస్థితులు, ఆదాయ అవసరాలు, పెట్టుబడి వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకుని పన్ను విధానాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తామని తెలిపారు. అయితే ప్రస్తుతం ఎల్‌టీసీజీ పన్నును రద్దు చేయాలనే నిర్ణయం లేదని స్పష్టంగా పేర్కొన్నారు. గత కొంతకాలంగా స్టాక్ మార్కెట్‌లో రిటైల్ ఇన్వెస్టర్ల సంఖ్య గణనీయంగా పెరగడంతో ఈ పన్నును రద్దు చేయాలని లేదా కనీస మినహాయింపు పరిమితిని పెంచాలని మార్కెట్ వర్గాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. దీర్ఘకాలిక పెట్టుబడులను ఈ పన్ను నిరుత్సాహపరుస్తోందని, పెట్టుబడిదారుల నికర రాబడిని తగ్గిస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లకు ఇటీవల ప్రభుత్వం కొన్ని పన్ను రాయితీలు ప్రకటించిన నేపథ్యంలో దేశీయ పెట్టుబడిదారులకు కూడా సమాన ప్రయోజనాలు కల్పించాలని మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు.

## తల్లీ-బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు సిద్ధం

- వాహనాలను పరిశీలించిన చంద్రబాబు
- మాతా - శిశు రవాణాకు ప్రాధాన్యం
- భద్రతా సౌకర్యాలపై సమీక్ష
- త్వరలో రాష్ట్రవ్యాప్తంగా సేవలు



అమరావతి, జూలై 20 : రాష్ట్రంలో మాతా-శిశు సంక్షేమ సేవలను మరింత బలోపేతం చేసే దిశగా సిద్ధం చేసిన 500 నూతన తల్లీ-బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం తన క్యాంపు కార్యాలయంలో పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు సురక్షితమైన, నాణ్యమైన రవాణా సౌకర్యం అందించేందుకు రూపొందించిన ఈ వాహనాల ఏర్పాట్లను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వాహనాల రూపకల్పన, భద్రతా ప్రమాణాలు, ప్రయాణికులకు కల్పించిన సౌకర్యాలను ముఖ్యమంత్రి క్షుణ్ణంగా పరిశీలించారు. తల్లులు, శిశువుల అవసరాలకు అనుగుణంగా వాహనాల్లో చేసిన మార్పులతో పాటు ప్రజలకు అవగాహన కల్పించేలా రూపొందించిన బ్రాండింగ్ నమూనాలను పరిశీలించి ఆమోదం తెలిపారు. సేవలు ప్రజలకు సులభంగా చేరేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన బాలింతలు, వారి నవజాత శిశువులు, సహాయకులను ఉచితంగా వారి ఇళ్లకు సురక్షితంగా చేర్చడమే ఈ పథకం ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు. అధిక రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులు, ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న గర్భిణులను వైద్య పరీక్షల కోసం ఆసుపత్రులకు తరలించేందుకు కూడా ఈ వాహనాలను వినియోగించనున్నట్లు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 500 ఎస్‌యూవీ, ఎంయూవీ వాహనాల ద్వారా ఈ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ సేవల ద్వారా ప్రతి ఏడాది సుమారు 2.75 లక్షల మంది బాలింతలు లబ్ధి పొందనున్నట్లు అధికారులు వెల్లడించారు. మాతా--శిశు మరణాలను తగ్గించడం, అత్యవసర వైద్య సేవలను వేగంగా అందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. వాహనాల్లో వెనుక సీట్లకు సైతం సీటు బెల్టులు, బాలింతలు సులభంగా ఎక్కి దిగేందుకు ఫుట్‌రెస్ట్, శీతలీకరణ సౌకర్యం, ప్రథమ చికిత్స కిట్, అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేశారు. ప్రతి వాహనానికి జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థను అనుసంధానం చేసి, వాటి కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నట్లు అధికారులు వివరించారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య--కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి వీరపాండ్యన్, జాతీయ ఆరోగ్య మిషన్ అధికారులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వాహనాలపై అధికారిక గుర్తులు అమర్చి త్వరలోనే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో తల్లీ--బిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలను ప్రారంభించనున్నట్లు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు.



## ఎల్-నినోపై మంత్రి సమీక్ష

- అనంతపురంలో అధికారులతో సమావేశం
- వ్యవసాయంపై ప్రభావం పరిశీలన
- ముందస్తు చర్యలకు ఆదేశాలు
- శాఖల సమన్వయంపై దృష్టి

అనంతపురం, జూలై 20: రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సోమవారం అనంతపురం నగరంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఎల్-నినో పరిస్థితులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో నెలకొన్న వాతావరణ పరిస్థితులు, వాటి ప్రభావం వ్యవసాయం, తాగునీటి సరఫరా, సాగునీటి నిర్వహణపై పడే ప్రభావాన్ని వివిధ శాఖల అధికారులతో సమగ్రంగా చర్చించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ పాల్గొన్నారు. సమావేశంలో వ్యవసాయ, ఉద్యానవన, హెచ్‌ఎన్ఎస్ఎస్, హెచ్ఎల్‌సీ, మైనర్ ఇరిగేషన్, కేవీకే శాస్త్రవేత్తలు, ఆర్‌డబ్ల్యూఎస్, డీపీఓతో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొని జిల్లాలోని ప్రస్తుత పరిస్థితులను మంత్రికి వివరించారు.

## హైడ్రోజన్ రైలుతో కొత్త చరిత్ర





- దేశానికి గ్రీన్ టెక్నాలజీలో మైలురాయి
- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హర్షం
- పర్యావరణహిత రవాణాకు కొత్త దిశ
- సుస్థిర అభివృద్ధికి భారత్ కట్టుబాటు

అమరావతి, జూలై 20: దేశంలో తొలి గ్రీన్ హైడ్రోజన్ ఆధారిత రైలు ప్రారంభం కావడం భారత్ సుస్థిర అభివృద్ధి దిశగా సాధించిన చారిత్రాత్మక విజయమని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పర్యావరణ, అటవీ, విజ్ఞాన సాంకేతిక శాఖ మంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం పర్యావరణహిత రవాణా వ్యవస్థ వైపు మరో కీలక అడుగు వేసిందని ఆయన తెలిపారు. గ్రీన్ హైడ్రోజన్‌తో నడిచే ఈ రైలు ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన, అత్యంత పొడవైన బ్రాడ్‌గేజ్ హైడ్రోజన్ రైలు సముదాయాల్లో ఒకటిగా నిలిచిందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. వినియోగ సమయంలో కేవలం నీటి ఆవిరి మాత్రమే విడుదల చేసే ఈ సాంకేతికత పర్యావరణ పరిరక్షణతో పాటు ఆర్థికాభివృద్ధికి కూడా దోహదపడుతుందని అన్నారు. గత పదేళ్లలో భారతీయ రైల్వేలు విద్యుదీకరణ, వందే భారత్ రైళ్లు, ఆధునిక రైల్వే స్టేషన్లు, ప్రత్యేక సరకు రవాణా మార్గాలు, స్వదేశీ భద్రతా వ్యవస్థలు వంటి అనేక రంగాల్లో విశేష పురోగతి సాధించాయని తెలిపారు. ఇప్పుడు హైడ్రోజన్ ఆధారిత రైలు ప్రారంభంతో సుస్థిర రైల్వే రవాణాలో భారత్ ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఇది కేవలం రవాణా రంగంలో సాధించిన విజయం మాత్రమే కాకుండా పర్యావరణ పరిరక్షణ, సాంకేతిక ఆవిష్కరణలు కలిసికట్టుగా ముందుకు సాగగలవని నిరూపించిన ఘట్టమని పవన్ కల్యాణ్ అన్నారు. స్వచ్ఛమైన ఇంధన వినియోగం ద్వారా భవిష్యత్ తరాలకు మెరుగైన పర్యావరణాన్ని అందించే దిశగా ఇది కీలక అడుగని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా స్వచ్ఛ ఇంధనం, సహజ వనరుల పరిరక్షణ, సుస్థిర అభివృద్ధికి దోహదపడే సాంకేతికతలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పవన్ కల్యాణ్ తెలిపారు. భవిష్యత్ తరాలకు పర్యావరణహిత అభివృద్ధిని అందించేందుకు అన్ని విధాలా కృషి కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ చారిత్రాత్మక విజయాన్ని సాధించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రైల్వే శాఖ, శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, భారతీయ రైల్వేలు, పరిశోధన సంస్థలు, ఈ ప్రాజెక్టు అమలులో భాగమైన ప్రతి ఒక్కరికీ పవన్ కల్యాణ్ అభినందనలు తెలిపారు. గ్రీన్ టెక్నాలజీ ద్వారా స్వచ్ఛమైన పర్యావరణం, బలమైన భారత్ నిర్మాణం సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు.



## విమానాశ్రయ ప్రారంభోత్సవ ఏర్పాట్ల పరిశీలన

- ఆగస్టు 1న ప్రధాని చేతుల మీదుగా ప్రారంభం
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో కలిసి ఏర్పాట్ల సమీక్ష
- భద్రత, ట్రాఫిక్, పార్కింగ్‌పై అధికారులకు ఆదేశాలు
- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచన
- మంత్రి వంగలపూడి అనిత

విజయనగరం, జూలై 20 : ఆగస్టు 1న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా జాతికి అంకితం కానున్న భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లను ఆంధ్రప్రదేశ్ హోం, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత, రహదారులు మరియు భవనాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు చేపడుతున్న ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విమానాశ్రయం పరిసర ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ సదుపాయాలు, హెలిప్యాడ్ ఏర్పాట్లు, ప్రజా వేదిక నిర్మాణం తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రధాని పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా ఉండేలా అధికారులకు పలు సూచనలు చేశారు. పర్యటనకు సంబంధించిన ప్రతి విభాగం సమన్వయంతో పనిచేయాలని మంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. పోలీసు, రెవెన్యూ, రవాణా, ఆరోగ్య, విద్యుత్, మున్సిపల్ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో బాధ్యతలు నిర్వర్తించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. భద్రతా ప్రమాణాల విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి పర్యటన సందర్భంగా ప్రజలకు అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ నిర్వహణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

# జాతీయ అప్రెంటిస్‌షిప్ ప్రమోషన్ పథకం (ఎన్ ఏ పి ఎస్ 2.0) ద్వారా ఆంధ్రప్రదేశ్ యువతకు కొత్త ఆశలు



విజయవాడ అనంత సూర్య ప్రతినిధి : పార్లమెంట్‌లో లోక్‌సభ సభ్యుడు కేశినేని శివనాథ్ (చిన్ని) అడిగిన ప్రశ్నకు కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్ చౌదరి రాతపూర్వక సమాధానం.నాలుగేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 93,094 మంది యువతీ యువకులకు వివిధ రంగాలలో అప్రెంటిస్‌లుగా చేరిక క్షేత్రస్థాయిలో శిక్షణ మరియు నైపుణ్యాలకు పదును పెట్టడం వల్ల యువత ఉపాధి మెరుగ్గా అవకాశాలు.'డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్' ( డి బి టి ) ద్వారా నేరుగా అప్రెంటిస్‌ల బ్యాంక్ ఖాతాల్లోకే స్టైఫండ్ జమ .2021-22లో కేవలం రూ.4.43 కోట్లుగా ఉన్న నిధులు 2024-25 నాటికి ఏకంగా రూ.19.69 కోట్లకు చేర్చిన కేంద్రశీ.న్యూ ఢిల్లీ (పార్లమెంట్) ఆంధ్రప్రదేశ్లో జాతీయ అప్రెంటీస్ ప్రమోషన్ పథకం ( ఎన్ ఏ పి ఎస్ 2.0) ద్వారా ఆంధ్రప్రదేశ్ యువతకు కొత్త ఆశలు వచ్చాయని నాలుగేళ్లలో ఆంధ్రప్రదేశ్లో దాదాపుగా వేల మందికి యువతీ యువకులకు వివిధ రంగాల్లో అప్రెంటీసులుగా చేరి క్షేత్రస్థాయిలో శిక్షణ మరియు నైపుణ్య అభివృద్ధిని మొదలు పెట్టడం వల్ల ఎంతో మంది యువతకు ఉపాధి అవకాశాలు లభించాయని వారికీ స్టైఫండ్ కూడా జమ చేసినట్లు కేంద్ర నైపుణ్య అభివృద్ధి మరియు వ్యవస్థాపక మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి జయంతి చౌదరి వెల్లడించారు. లోక్ సభలో సోమవారం ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని ) ఆంధ్రప్రదేశ్లో జాతీయ అప్రెంటిస్ ప్రోత్సాహక పథకం ( ఎన్ ఏ పి ఎస్ )2.0 ద్వారా ఎంతమందికి అప్రెంటిస్ షిప్ ల ట్రైనింగ్ పరిశ్రమల ద్వారా పొందిన అవకాశాలు లబ్ధి పొందిన వారి సంఖ్య స్టైఫండ్ వంటి వివిధ అంశాలపై కేంద్ర నైపుణ్యాభివృద్ధి మరియు వ్యవస్థాపక మంత్రిత్వ శాఖను ప్రశ్నించగా ఆ శాఖ సహాయ మంత్రి జయంతి చౌదరి రాతపూర్వకంగా సమాధానం ఇచ్చారు .ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో యువతకు కేంద్రం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జాతీయ అప్రెంటిస్ షిప్ ప్రమోషన్ పథకం ( ఎన్ ఏ పి ఎస్ 2.0) కొత్త ఆశలు చిగురింప చేసేలా చేస్తుంది . రాష్ట్రంలో ఈ పథకం గడచిన నాలుగు సంవత్సరాలలో దాదాపుగా 93 094 మంది యువతీ యువకులకు అప్రెంటిస్ షిప్ పూర్తిచేసి పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా క్షేత్రస్థాయిలో శిక్షణ ఇస్తూ వారి నైపుణ్యాలకు పదును పెట్టి యువతి యువకులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా చేసింది . కేవలం అప్రెంటిస్ షిప్ సంఖ్య పెరగడమే కాకుండా రాష్ట్రంలో వారికి శిక్షణ ఇచ్చేందుకు1135 ప్రత్యేక పరిశ్రమలు ముందుకు వచ్చాయని తెలియజేశారు పైగా ఎలాంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రభుత్వం అందించే స్టైఫండ్ మద్దతును డైరెక్టర్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ ( డి బి టి ) ద్వారా నేరుగా అప్రెంటిస్ షిప్ తీసుకునే వారి బ్యాంకు ఖాతాలోనే జమ చేస్తుండడం వల్ల ఈ పథకానికి ఆదరణ మరియు పారదర్శకత పెరిగింది . ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమానికి కేంద్ర ఆర్థిక మద్దతు కూడా గణనీయంగా పెరుగుతుంది 2021- 22లో 4.43 కోట్లుగా ఉన్న నిధులు 2024-25 నాటికి ఏకంగా 19.65 కోట్ల కు కేంద్రం చేర్చింది ఈ చేరిక ద్వారానే కేంద్ర ప్రభుత్వం ఈ పథకానికి ఎంత ప్రాధాన్యత ఇచ్చిందో చాలా సుస్పష్టంగా అర్థమవుతుంది అయితే కేవలం నిధులు కేటాయింపు గణాంకాల పెరుగుదలతో సరిపెట్టుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం కూడా దీనిపై ప్రత్యేక దృష్టి సాధించాలని తెలియజేశారు ప్రతి జిల్లాలో ఏ ఏ రంగాలలో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయో క్షుణ్ణంగా పరిశీలించి స్థానిక పరిశ్రమలతో విద్యార్థులను అనుసంధానం చేయాలని తెలిపారు పరిశ్రమల అవసరాలకు విద్యాసంస్థల బోధనకు మధ్య ఉన్న దూరం పూడ్చినప్పుడే ఈ నైపుణ్య యజ్ఞం పూర్తవుతుందని తెలియజేశారు . నవ్యాంధ్ర ప్రగతి పథంలో యువతను భాగస్వామ్యం చేస్తూ వారి శ్రమ శక్తికి సరైన గుర్తింపునిచ్చేలా ఈ పథకాన్ని మరింత విస్తృతంగా క్షేత్రస్థాయికి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రభుత్వం మరియు పాలకులపై ఉందని స్పష్టం చేశారు .

# మహిళల భద్రత ఎక్కడ?గుంటూరు ఘటనపై దోషులకు కఠిన శిక్ష విధించాలి




గుంటూరు నవ తెలుగంగ ప్రతినిధి : కూటమి పాలనలో మహిళలపై దాడులు ఆందోళనకరం -స్వేచ్ఛ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షురాలు గుడిపూడి జయప్రద-ఎన్టీఆర్ జిల్లా, ఇబ్రహీంపట్నం రాష్ట్రంలో కూటమి పాలనలో మహిళలకు రక్షణ కరువైందని స్వేచ్ఛ వెల్ఫేర్ సొసైటీ (ఇబ్రహీంపట్నం) అధ్యక్షురాలు గుడిపూడి జయప్రద ఆవేదన వ్యక్తం చేశారు. గుంటూరులో ఓ మహిళపై టీడీపీ నాయకుడు తన కుటుంబ సభ్యులతో కలిసి దాడి చేసిన ఘటనను ఆమె తీవ్రంగా ఖండించారు.మహిళా హోంమంత్రి ఉన్న రాష్ట్రంలో మహిళపై నడిరోడ్డుపై దాడి జరగడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. మహిళను అవమానించేలా జరిగిన ఈ ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా విజయ విహారం రమణమూర్తిపై జరిగిన దాడిని కూడా ఆమె తీవ్రంగాఖండించారు.రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడుతూ మహిళల భద్రతకు ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో స్వేచ్ఛ వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి అంకాల విజయకుమారి, కోశాధికారి కంభంపాటి ఇందిరా, కమిటీ సభ్యులు పరంజ్యోతి, కాటారపు జ్యోతి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# జోగి నీకు ఎమ్మెల్యే దాకా ఎందుకు.?

- దమ్ముంటే నాతో చర్చకు రా..!
- జోగి రమేష్‌కు సవాల్

మైలవరం అనంత సూర్య ప్రతినిధి : జి.కొండూరు టీడీపీ అధ్యక్షులు వేములకొండ వెంకటేశ్వరరావు సవాల్.జోగి రమేష్ నీకు మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ వరకు ఎందుకు నీకు దమ్ముంటే నాతో చర్చకు రా..!, చెత్త వాగుడు మాత్రం వాగకు అని జి.కొండూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వేములకొండ వెంకటేశ్వరరావు సవాల్ విసిరారు. జి.కొండూరు మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు వేములకొండ వెంకటేశ్వరరావు మాజీ మంత్రి జోగి రమేష్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. జి.కొండూరులో సోమవారం మీడియాతో మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పై జోగి రమేష్ చేస్తున్న వ్యాఖ్యలను ఖండిస్తూ, ఆయన నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. జోగి రమేష్ చేస్తున్న రాజకీయ విమర్శలు, సవాళ్లు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని అన్నారు. "జోగి రమేష్ చేసే ఆరోపణలకు మా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ కి ఎలాంటి సంబంధం లేదన్నారు. అనవసరంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పేరును లాగుతూ జోగి రాజకీయ హడావిడి చేస్తున్నాడని విమర్శించారు.జోగి రమేష్ తన సొంత బాబాయి దగ్గర కూడా డబ్బులు కొట్టేసాడని ఆరోపించారు. పెడనలో జోగి రమేష్ గెలుపుకు కూడా వసంత కృష్ణప్రసాద్ కృషి ఉందన్నారు. ఆ విషయాన్ని మరచిపోయి ఇప్పుడు ఆయనపైనే విమర్శలు చేయడం విశ్వాసఘాతుక రాజకీయాలకు నిదర్శనమని పేర్కొన్నారు.అలాగే జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో జోగి రమేష్ హౌసింగ్ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు లేఔట్ల అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల విడుదల విషయంలో జోగి రమేష్ కమిషన్లు, పర్సంటేజీలు వసూలు చేశాడన్నారు. జోగి తన సొంత సామాజిక వర్గంలోనే ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు చేశారన్నారు. కల్తీ మద్యం తయారుచేసిన చరిత్ర కలిగిన చిల్లర వ్యక్తి జోగి ఇప్పుడు నీతి, నిజాయితీ గురించి మాట్లాడటాన్ని ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. రాజకీయంగా ఎదుటివారిపై ఆరోపణలు చేసే ముందు తన గతాన్ని ఒకసారి గుర్తు చేసుకోవాలని జోగికి సూచించారు. జోగి రమేష్ తరచూ సవాళ్లు విసురుతున్నాడని, "సమయం నువ్వు చెప్పినా సరే, మమ్మల్ని చెప్పమన్నా సరే, చర్చకు సిద్ధమే అన్నారు. ఎమ్మెల్యే మీ ఇంటికి రావాల్సిన అవసరం లేదన్నారు. నీకు దమ్ముంటే నువ్వే మా ఇంటికి రాబిలేదంటే ప్లేస్, టైం చెప్పు మేమే ఎక్కడికైనా చర్చకు వస్తాం అన్నారు.జి.కొండూరులో వేములకొండ వెంకటేశ్వరరావు 24/7 అందుబాటులో ఉంటాడు.ముందు నన్ను ఎదుర్కో, తర్వాత మా ఎమ్మెల్యే గురించి మాట్లాడు" అంటూ ఘాటుగా సవాల్ విసిరారు.ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అభివృద్ధి పనులు వివిధ శాఖల్లో విస్తృతంగా జరుగుతున్నాయి అన్నారు.ప్రభుత్వ అనుమతి మేరకు నియమ నిబంధనల ప్రకారం



నిర్మాణ సామాగ్రి రవాణా జరుగుతుందన్నారు.దీన్ని చూసి తట్టుకోలేని జోగి రమేష్ ఎమ్మెల్యేపై నిరాదరణ ఆరోపణలు చేస్తూ, చౌకబారు రాజకీయాలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలోని అత్యంత దారుణంగా ఓడిపోయిన వ్యక్తి జోగి రమేష్ అని పేర్కొన్నారు.ప్రతి పనికి కౌంటర్లు పెట్టి వసూలు చేసిన ఘనత జోగి రమేష్ కి దక్కుతుందన్నారు.ప్రజల రక్తాన్ని జలగల పీల్చుకున్న చిల్లర వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే జోగి రమేష్ అని పేర్కొన్నారు.ఇకపై మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ గురించి ఆధారాలు లేని ఆరోపణలు, వ్యక్తిగత విమర్శలు చేయకుండా జాగ్రత్తపడాలని హెచ్చరించారు. ప్రజల ముందు ఎప్పుడైనా బహిరంగ చర్చకు సిద్ధమని వేములకొండ వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. "జోగి రమేష్ ఖబర్దార్. మరోసారి ఇలాంటి సవాళ్లు, ఆరోపణలు చేసే ముందు ఆలోచించుకో" అంటూ అయన తీవ్రంగా హెచ్చరించారు.

# డీఎస్సీ నియామకాల్లో అవకతవకలపై సి.బి.ఐ విచారణ జరపాలి

విజయవాడ అనంత సూర్య ప్రతినిధి : ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి యుగంధర్ డిమాండ్.ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన ఏఐవైఎఫ్ నాయకులు.



నిరుద్యోగ భృతి, కొత్త నోటిఫికేషన్లు తక్షణమే విడుదల చేయాలి: రాష్ట్ర కార్యదర్శి యుగంధర్.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డీఎస్సీ నియామక ప్రక్రియలో అనేక అవకతవకలు జరిగాయని, దీనిపై సమగ్ర సీబీఐ విచారణ జరిపించి నిరుద్యోగులకు న్యాయం చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం విజయవాడలోని ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో ఏఐవైఎఫ్ ప్రతినిధుల బృందం గౌరవ జాయింట్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించింది.ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి యుగంధర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని లక్షలాది మంది నిరుద్యోగ యువతీ యువకుల భవిష్యత్తుకు సంబంధించిన డీఎస్సీ నియామకాల్లో పారదర్శకత లోపించిందని అభ్యర్థుల నుండి అనేక అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. రాత్రింబగళ్లు కష్టపడి చదివిన అర్హులైన అభ్యర్థులకు న్యాయం జరగాలంటే సీబీఐ విచారణ ఒక్కటే మార్గమని, అభ్యర్థుల్లో నెలకొన్న ఆందోళనలను తొలగించి పూర్తి పారదర్శకంగా నియామకాలు చేపట్టాలని కోరారు. దీనితో పాటు రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం ఏఐవైఎఫ్ తరపున క్రింది డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచుతున్నట్లు ఆయన తెలిపారు.నిరుద్యోగ భృతి. కూటమి నాయకులు ఎన్నికల సూపర్ సిక్స్ హామీలలో ప్రకటించిన విధంగా, నిరుద్యోగ యువతకు వెంటనే నిరుద్యోగ భృతిని చెల్లించాలి. కొత్త నోటిఫికేషన్లు వివిధ ప్రభుత్వ శాఖల్లో, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే నోటిఫికేషన్ల ద్వారా భర్తీ చేయాలి. అవినీతి రహిత నియామకాలు. రాష్ట్రంలో జరిగే అన్ని రకాల ఉద్యోగ నియామక ప్రక్రియలను ఎటువంటి అవినీతి, అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించాలి.వయోపరిమితి పెంపు సుదీర్ఘ కాలంగా నోటిఫికేషన్ల కోసం ఎదురుచూసి వయసు పైబడిన అభ్యర్థులను దృష్టిలో ఉంచుకుని, అన్ని పోటీ పరీక్షలకు గరిష్ట వయోపరిమితిని పెంచాలి.ఉచిత శిక్షణ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలి. ఆర్థిక ప్రోత్సాహకాలు నిరుద్యోగులను కేవలం ఉద్యోగార్థులుగా కాకుండా, పారిశ్రామికవేత్తలుగా మార్చేందుకు గౌరవ ముఖ్యమంత్రి హామీ మేరకు సరైన శిక్షణ, ఆర్థిక ప్రోత్సాహకాలు అందించాలి.నైపుణ్య శిక్షణ నిరుద్యోగ యువత స్వయం ఉపాధి పొందేందుకు అవసరమైన నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహించాలి.ప్రభుత్వం ఈ డిమాండ్లపై సానుకూలంగా స్పందించి, నిరుద్యోగ యువతకు వెంటనే చేయూతనివ్వాలని, లేని పక్షంలో నిరుద్యోగుల పక్షాన నిలిచి ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యక్ష ఉద్యమానికి సిద్ధమవుతామని యుగంధర్ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ విజయవాడ నాయకులు సింగంశెట్టి మోహన్ ప్రసాద్, వెంకటేశ్వర్లు,శ్రీరశీ రవికుమార్, ఎస్ షైనీ పాల్గొన్నారు.

# నామ మాత్రంగా ప్రజా పరిష్కార వేదికలు అధికార దుర్వినియోగం చేస్తున్న అధికారులు

విజయవాడ అనంత సూర్య ప్రతినిధి : అర్జిదారులకు తప్పని తిప్పలు-అయొమయంలో ప్రజలు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పరిష్కార వేదిక ద్వారా ప్రజల సమస్యలపై ఆయా శాఖ అధికారుల ద్వారా న్యాయం చేయించాలని ఎన్నో వ్యయ ప్రయాసలు కోర్చి జిల్లా స్తాయి నుండి మండల శాఖా కార్యాలయాల్లో ప్రతి సోమవారం అర్జీలను సమర్పిస్తున్నారని,కాని అధికారులకు సమస్యలు పరిష్కారం కోసం రెండు నెలల పదిహేను రోజులు గడువును ప్రభుత్వం నిర్దేశించినదని,తద్వారా జిల్లా అధికారులు అయా శాఖ అధికారుల కార్యాలయాలకు పంపిస్తున్నారని,మండలాధికారులు సంభందిత గ్రామాధికారులకు పంపిస్తున్నారని, గ్రామాధికారులు తమ ఇష్టానుసారంగా అర్జీదారులకు వ్యతిరేకంగా నివేదికలు తయారు చేసి సమస్యలు పై విచారణ చేస్తున్నట్టుగా అర్జిదారులతో కలిసి ఫోటోలు దిగి, అర్జిదారుల సమస్యలు పరిష్కరించకుండా అర్జిదారులకు విరుద్ధంగా కొంతమందితో వారికి అనుకూలం గా సాక్షుల సంతకాలు పెట్టిస్తూ సమస్యలు పరిష్కరిచామని నివేదికలు యంత్ర పరికరాలలో పొందుపరచి అర్జిదారులకు అన్యాయం చేస్తున్నారని,గ్రామాధికారులు తయారుచేసిన తప్పు నివేదిక లలో అర్జిదారులు సంతకాలు పెట్టానిచో రిజిస్టర్ పోస్ట్ ద్వారా పంపించి అర్జీలను పరిష్కరించామని ఉన్నంతాధికారులకు,ప్రభుత్వ యాప్ లో పొందుపరుస్తామని చెప్పి అర్జిదారులకు చెప్పి,ఈ ఏండార్స్మెంట్ కాపీ తీసుకొని మల్లి అర్జీ పెట్టుకొండని ఉచిత సలహాలనిస్తూ దాటవేస్తున్నారని,ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేయబడిన ప్రజా పరిష్కార వేదిక లోని అర్జీలు పై న్యాయం జరగటం లేదని ప్రజలు వాపోతున్నారు ఇప్పటికైనా ప్రభుత్వం తగు చర్యలు తీసుకుని అర్జీల పరిష్కారం కోసం పెంచిన గడువును తగ్గించి అర్జిదారులకు న్యాయం చేయాలని,గత ప్రభుత్వంలో ప్రజా పరిష్కర వేదిక ద్వారా సమస్యలను పరిష్కరించడానికి అధికారులు వచ్చి బాధితుల ఇళ్ల దగ్గరకు వచ్చి సమస్యలు పరిష్కరించి ఆఫీసు యంత్ర పరికరాలలొ వేలుముద్రలు వేయించుకొనేవారని అర్జీదాలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం వ్యవహరించిందని,ప్రస్తుతం అధికారులందరు ఏకస్తులై ప్రజా పరిష్కార వేదిక అర్జీలకు పరిష్కారం చేయకుండా నిర్వీర్యం చేస్తున్నారని, నాయకులు కూడా అధికారులకు అర్జీలు అందిస్తూన్నారని, ప్రభుత్వ కార్యాలయ అధికారులు అర్జీలను తీసుకొని పరిష్కరించామని నివేదికలుస్తుంటే అర్జిదారులు అసహనంతో ఆవేదనను వ్యక్త పరుసుత్తున్నారు.ఇప్పటికైనా అధికార కార్యాలయాలలో అధికారులతో పాటు నాయకులు,నియోజక వర్గ ఎమ్మెల్యేలు ప్రత్యేక శ్రద్ధతో జిల్లా స్థాయి నుండి గ్రామస్థాయి వరకు వచ్చిన అర్జీలు గురించి తెలుసుకోవాలని, అర్జీల పరిష్కారం కోసం అధికారులు తీసుకున్న చర్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపించి అర్జీదారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని,ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేయబడిన ప్రజా పరిరష్కార వేదిక ద్వారా న్యాయం జరిగేలా ప్రయత్నించాలని అర్జీదారులు,ప్రజలు కోరుతున్నారు




# వివాహ వేడుకలో ప్రముఖుల కలయిక



ఇబ్రహీంపట్నం అనంత సూర్య ప్రతినిధి : ఇబ్రహీంపట్నం మండలం మూలపాడు వాస్తవ్యులు గొరిజాల సాంబశివరావు బిశివకుమారి కుమారుని వివాహ వేడుకలో మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ,ప్రముఖ పారిశ్రామికవేత్త కోగంటి సత్యనారాయణ, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు జంపాల సీతారామయ్య గుంటూరులోని వి.ఎ.ఆర్ గార్డెన్స్ హాల్ నందు జరిగిన వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులు చరణ్,పూజిత లకు అక్షింతలు వేసి ఆశీర్వదించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసారు.

# వారిది ధనయజ్ఞం.. మాది జలయజ్ఞం

## - పరిటాల శ్రీరామ్

- ప్రాజెక్టులు ఆగిపోవాలని కోరుకునే నాయకుడు జగన్ రెడ్డి
- హంద్రీనీవా పర్యటన సందర్భంగా పరిటాల శ్రీరామ్ వ్యాఖ్యలు
- ఫ్యాక్షన్ గ్రామాల్లో నీరు పారించి.. పరిస్థితుల్ని మార్చామన్న శ్రీరామ్
- ఎల్-నినో సమయంలో కూడా నీరుండేలా చేసిన నేత చంద్రబాబు.. శ్రీరామ్





అనంతపురం జూలై 20 అనంత సూర్య : వైసీపీతో పాటు గత పాలకులు ప్రాజెక్టుల పేరుతో ధనయజ్ఞం చేస్తే.. ముఖ్యమంత్రి చంద్రబాబు అన్ని ప్రాంతాలను సస్యశ్యామలం చేసే జలయజ్ఞం సాగుతోందని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. హంద్రీనీవా విషయంలో వైసీపీ నాయకులు చేస్తున్న డ్రామాలకు ధీటుగా శ్రీ సత్యసాయి జిల్లా టీడీపీ హంద్రీనీవా సందర్శన కార్యక్రమాన్ని చేపట్టింది. శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు ఎంఎస్ రాజు ఆధ్వర్యంలో జరిగిన యాత్రలో ఎమ్మెల్యే పరిటాల సునీతతో కలిసి శ్రీరామ్ పాల్గొన్నారు. ముందుగా రామగిరి మండలం కుంటిమద్ది గ్రామంలో హంద్రీనీవా నీటితో కళకళలాడుతున్న చెరువును పరిశీలించారు. స్థానికంగా ఉన్న రైతులతో వారు మాట్లాడారు. ఎప్పటి నుంచి నీరు వస్తున్నాయి.. ఎవరి హయాంలో మీకు మేలు జరిగిందన్నది ఆరా తీశారు. ఆ తర్వాత శ్రీ సత్యసాయి జిల్లాలో సాగుతున్న హంద్రీనీవా కాలువ పనులు పరిశీలిస్తూ.. స్థానిక రైతులను కలుసుకుంటూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంలో ఆర్థిక, సామాజిక అసమానతలను తొలగించాలంటూ నీరందించడమే పరిష్కారమన్న ఉద్దేశ్యంతో ఒక యజ్ఞాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగా 2014 నుంచి 2019వరకు హంద్రీనీవా కాలువ మొదటి దశను పూర్తి చేసి.. రెండవ దశలో కీలకమైన పనులన్నీ చేశారన్నారు. దాని ఫలితంగానే జిల్లాలో ఎన్నో వందలాది చెరువులకు, చెక్ డ్యాంలకు నీరు అందుతోందన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో తగరకుంట వంటి ప్రాంతాల్లో గతంలో ఫ్యాక్షన్ గొడవల్లో ప్రశాంతత లేకుండా గడిపేవారన్నారు. అలాంటి గ్రామానికి కూడా నీరు అందించి.. ప్రజలంతా వ్యవసాయంలో నిమగ్నమయ్యేలా చేసిన సంఘటన చంద్రబాబుకే దక్కిందన్నారు. ఒక్క తగరకుంట మాత్రమే కాకుండా అనేక గ్రామాల్లో ఇలాంటి పరిస్థితి కనిపిస్తోందన్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి చంద్రబాబు వరకు రాయలసీమ అభివృద్ధి కోసం పనిచేశారని గుర్తు చేశారు. గతంలో ప్రాజెక్టులంటే తన జేబులు నింపుకునే వాటిగా మాత్రమే చూశారన్నారు. కానీ ఇప్పుడు తక్కువ ఖర్చుతో ప్రాజెక్టులను పూర్తి చేస్తున్న నాయకుడు చంద్రబాబు అని అన్నారు. వైసీపీ నాయకుల పర్యటనలు చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. ఎక్కడైనా ఏ నాయకుడైనా ప్రాజెక్టులు పూర్తి చేయాలని.. ప్రజలు సంతోషంగా ఉండాలని కోరుకుంటారని.. కానీ జగన్ రెడ్డి మాత్రం ప్రాజెక్టులు ఆగిపోవాలి.. దాని విషయంలో రాజకీయాలు చేయాలనుకుంటున్నారన్నారు. ఇలాంటి నాయకుడు ఉన్నందుకు సిగ్గుపడాలన్నారు. వాస్తవంగా ఏం జరుగుతోందన్నది రైతులు, ప్రజలను అడిగితే తెలుస్తుందన్నారు. ఎల్-నినో సమయంలో చెరువుల్లో ఇలా పూర్తి స్థాయిలో నీటితో కళకళ లాడుతున్నాయంటే.. అది చంద్రబాబు ఘనత మాత్రమేనన్నారు. గత ఐదేళ్లలో హంద్రీనీవా ప్రాజెక్టులో కనీసం తట్టెడు మట్టైనా తీశారా అని నిలదీశారు. ఈ రోజు అటు తమిళనాడు బార్డర్ కుప్పం, ఇటు కర్ణాటక బార్డర్ మడకశిర వరకు నీరు తీసుకెళ్తున్నారన్నారు. ఏదైనా మా ప్రభుత్వాన్ని ప్రశ్నించే ముందు... మనమేం చేశామన్నది చూసుకోవాలని పరిటాల శ్రీరామ్ హితవు పలికారు.

# మహిళల ఆడ బిడ్డల ఆర్తనాదాలువినిపించవా చంద్రబాబు




విజయవాడ అనంత సూర్య ప్రతినిధి : మహిళల భద్రతలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలం. నిందితులకు భయం లేకుండా పోయింది మహిళలకు రక్షణ కరువైంది రాష్ట్ర హోంమంత్రికి కన పడటం లేదా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మైనారిటీ బాజీ బాబా విజయవాడ పశ్చిమ నియోజకవర్గం 55వ డివిజన్లోని మైనారిటీ కార్యాలయంలో పత్రికా ప్రకటన విడుదల రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీల మీద మహిళలపైదాడులు అత్యాచారాలు హత్యలు పెరిగిపోతున్నాయని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గుంటూరు నగరంలో ఇటీవల ఒక మహిళపై జరిగిన దారుణ ఘటన రాష్ట్రంలో మహిళల భద్రత ఎంత దయనీయంగా మారిందో చెప్పడానికి నిదర్శనమని అన్నారు.మహిళలపై దాడులు జరుగుతున్నా ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం సకాలంలో స్పందించకపోవడం దారుణమని ఆయన విమర్శించారు రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్, మద్యం విచ్చలవిడిగా అందుబాటులో ఉండటం వల్ల యువతలో నేరప్రవృత్తి పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. నేరాలను అరికట్టాల్సిన పోలీసులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గుతున్నారనే భావన ప్రజల్లో ఏర్పడుతోందని అన్నారు.మహిళలపై దాడులకు పాల్పడే నిందితులకు చట్టం, పోలీసులంటే భయం లేకుండా పోయిందని- బాజీ బాబా విమర్శించారు. మహిళలపై దాడి జరిగిన వెంటనే నిందితులను అరెస్టు చేసి, బాధితులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసం వ్యవహరిస్తోందని ఆరోపించారు. నిందితులు ఎంతటి వారైనా చట్టం ముందు సమానమేనని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. గుంటూరు నగరంలో మహిళపై జరిగిన దాడి ఘటనపై ప్రభుత్వం తక్షణమే సమగ్ర దర్యాప్తు జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. బాధిత మహిళకు పూర్తి రక్షణ కల్పించడంతో పాటు, ఆమెకు వైద్య, న్యాయ సహాయం అందించాలని కోరారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అన్నారు.మహిళల భద్రత కోసం మాజీముఖ్య మంత్రి వర్యులు జగన్మోహన్ రెడ్డి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మహిళల భద్రతకు.దిశ చట్టాన్ని అమలు చేసిందని. లిబాజీ బాబా గుర్తుచేశారు. గత ప్రభుత్వ హయాంలో మహిళల రక్షణకు ప్రాధాన్యత ఇచ్చి, మహిళా పోలీస్ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు, మహిళలకు భద్రత కల్పించే అనేక చర్యలు చేపట్టామని తెలిపారు. మహిళలు, బాలికలపై వేధింపులు, దాడులను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఒకవైపు మహిళల భద్రతపై గొప్పలు చెప్పుకుంటూ, మరోవైపు మహిళలపై దాడులు జరుగుతున్నా నిందితులపై కఠిన చర్యలు తీసుకోకపోవడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తోందని అన్నారు. మహిళలపై జరుగుతున్న అన్యాయాలపై వైఎస్సార్‌సీపీ మౌనంగా ఉండదని బిబాజీ బాబా స్పష్టం చేశారు. బాధిత మహిళలకు న్యాయం జరిగే వరకు, రాష్ట్రంలో మహిళలకు సంపూర్ణ భద్రత కల్పించే వరకు వైఎస్సార్‌సీపీ ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు.మహిళల భద్రత విషయంలో ప్రభుత్వం ఇకనైనా మేల్కొని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# అన్నం పెట్టిన చేతినే కరిచి వేశారు







విజయవాడ అనంత సూర్య ప్రతినిధి : విజయవాడ - విద్యాధరపురం, చెరువు సెంటర్ లో బి మహాలక్ష్మి క్లాత్ షోరూం - అధినేత వారిది 380 గజాలు స్థలము కబ్జాకు గురికాబడినది. గత మూడు సంవత్సరాల కిందట సిమెంటు, ఇటుక రాళ్లు ఇసుక, వ్యాపారానికి లీజుకు ఇవ్వబడినది. వారు ఈ మధ్యకాలంలో స్థలం రోడ్డు మొదలులో రెండు నెలలుగా టిఫిన్ సెంటర్ పెట్టారు . ఇప్పుడు వారు అత్యాశతో మేము 25 సంవత్సరాలు కిందట ఈ స్థలం లో ఉన్నాము. ఈ స్థలము మా సొంత స్థలము అని కబ్జాకు పాల్పడ్డారు. చాలాసార్లు స్థలం ఖాళీ చేయమని అధినేత వారికి మీ లీజు కూడా పూర్తయినది అని చెప్పి చివరకు వారితో గొడవ పడుతూ ప్రాణాలు విడిచారు . ఇప్పుడు లేటెస్ట్ గా ఐరన్ హౌస్ ఒకటి కొని ఆ స్థలం ముందు సొంత స్థలం అయినా అధినేత వారు సెక్యూరిటీతో పొలంలో ఏర్పరిచారు. అయినా లీజు వారు ( అన్నం తిన్న చేతినే కరిచి వేసే )పద్ధతిలో ఈ స్థలం మాది అని పబ్లిక్ తో ప్రజలు తో ఫోటోలు కబ్జాకు గట్టిగా ఎదురు నిలబడుతున్నారు . చివరకు భవానీపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


## సర్ ప్రక్రియపై బిఎల్ఏలు అప్రమత్తంగా ఉండాలి



విజయవాడ అనంత సూర్య ప్రతినిధి : అర్హులైన ఏ ఒక్కరూ ఓటు కోల్పోకుండా చూడాలి. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దిశా నిర్దేశం. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ( సర్ ) ప్రక్రియ ముగింపు దశకు చేరుకుంటున్నందున, అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు ఓటరు జాబితాలో ఉండేలా, నకిలీ ఓట్ల తొలగింపు విషయంలో బిఎల్ఎలు అప్రమత్తంగా ఉండాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దిశా నిర్దేశం చేశారు. రావులపాలెంలోని శ్రీకృష్ణదేవరాయ కాపు కళ్యాణ మండపంలో ఆత్రేయపురం మరియు రావులపాలెం పార్టీ నాయకులు, బిఎల్ఏ లతో సర్ పై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్ ప్రక్రియలో భాగంగా ఇప్పటివరకు మృతుల ఓట్లు, శాశ్వత వలసదారుల ఓట్లు, గుర్తుతెలియని (అన్ ఐడెంటిఫైడ్) ఓట్లకు సంబంధించి జాబితాలను సమగ్రంగా పరిశీలించి అర్హులైన ఏ ఒక్కరూ ఓటును కోల్పోకుండా చూడాల్సిన బాధ్యత బిఎల్ఎలపై ఉందన్నారు. నేటి నుంచి అందరూ ఈ అంశాలపై దృష్టి సారించాలన్నారు.

## బాపట్లలో పేట్రేగిపోతున్న నకిలీ వైద్యులు

బాపట్ల అనంత సూర్య ప్రతినిధి : అనుమతులు మెడికల్ షాపుకు చేసేది వైద్యం. ఏ సమస్య వచ్చినా ఇంజెక్షన్ సెలైన్ లు. అధిక మోతాదులో యాంటీ బయోటిక్స్ వినియోగం. బెడ్లు ఏర్పాటు చేసి వైద్యం. రక్త పరీక్షలు ,థైరాయిడ్ టెస్టులు, ఎక్సరే లు వీరి ఆధ్వర్యంలోనే రోగం ముదిరే వరకు ఇక్కడే వైద్యం .పరిస్తితి విషమించే స్తాయి వస్తె వీరే పెద్ద ఆసుపత్రికి కమిషన్ లెక్కన




సిఫార్సు అంబులెన్సు లు వీరి చెప్పు చేతుల్లోనే ? ఎటువంటి అర్హత లేకుండా వైద్యం,ప్రజల ప్రాణాలతో చెలగాటంమిన్నకుండిపోయిన అధికారులు.

## వేస్ట్ చెత్తను ప్రమాదకరంగా తగల వేస్తున్నారు

విజయవాడ అనంత సూర్య ప్రతినిధి: భవానిపురం ఐరన్ యాడ్ చివరి భాగంలో అన్ని రకముల పేస్టు చెత్తను అన్యాక్రాంతంగా వేయటం కాక



ప్రమాదకర పరిస్థితుల్లో చుట్టుపక్కల ఉన్న అనేక గోడౌన్స్ మధ్యలో ఆదివారం సాయంత్రం నాలుగు గంటల మధ్యలో భారీగా అగ్నికి వేస్ట్ చేస్తున్న తగులు పెడుతున్నారు. అక్కడ గోడౌన్స్ వారు ఆదివారం కావడంతో ఎవరు లేకపోవడం అత్యంత ప్రమాదకరానికి దారి తీస్తుంది .




## ఎల్.ఓ.సిలను పంపిణీ చేసిన బిఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు

గొల్లపూడి అనంత సూర్య ప్రతినిధి : విజయవాడ రూరల్ మండలంలోని గొల్లపూడిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం మైలవరం శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాదు ఎల్.ఓ.సి (లెటర్ ఆఫ్ క్రెడిట్) పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు.పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు వైద్య చికిత్సలు భారంగా మారకుండా ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా కుంటముక్కల గ్రామానికి చెందిన కె.సన్నీ కుమార్ కు రూ.1,53,929, కూనపరాజు పర్వ గ్రామానికి చెందిన పి.నాగేశ్వరరావుకు రూ.1,61,137, తుమ్మలపాలెం గ్రామానికి చెందిన సిహెచ్.గిరి ప్రసాద్ కు రూ.2,05,116, నాగులూరు గ్రామానికి చెందిన ఎం.బాబు కు రూ.2,55,867 విలువైన ఎల్.ఓ.సి పత్రాలను ఎమ్మెల్యే కృష్ణప్రసాదు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత అని అన్నారు. ఆర్థిక ఇబ్బందులతో చికిత్స పొందలేని నిరుపేదలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడునాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి అర్హులకు వీలైనంత త్వరగా వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఎల్.ఓ.సిలు అందుకున్న లబ్ధిదారులు తమకు వైద్య సహాయం అందేలా కృషి చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి, ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి కుటుంబ సభ్యులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# బుల్లోడికి బంగారు ముడుపులతో.. బరితెగింపు

* యదేచ్ఛగా విద్యా నిబంధనలు తూచ్..
* హద్దులు దాటుతున్న అక్రమ ఫీజుల వసూళ్ల పర్వం
* ట్రేల్లీస్, జ్యోతి బుక్‌స్టాల్ లింకుపై జీఎస్టీ, సేల్స్ టాక్స్ మొద్దు నిద్ర
* విద్యా మంత్రి, జిల్లా మంత్రి స్పందనపైనే పలువురి ఆశలు
* నీటి బుడగల్లా మారిన విద్యార్థి నేతల ఆందోళనలు







**అనంతపురం, జూన్ 20 అనంత సూర్య :**

తెగింపు.. కాదు వారిది బరితెగింపు.. తప్పు చేస్తున్నా, విద్యా హక్కు చట్టం నిబంధనలు ఉల్లంఘిస్తున్నా.. కాదు కాదు హద్దులు మీరేలా వ్యవహరిస్తున్నా.. చర్యలు తీసుకునేవారు లేకపోవడంతో దారి దోపిడీకి తలదన్నేలా విద్యా దోపిడీకి పాల్పడుతున్నాయి ఆ విద్యాసంస్థలు. ఓ రెండు రోజుల కిందట **'అనంత సూర్య'** దినపత్రికలో అనంతలో వైజాగ్ వారి విద్యా దోపిడి.. ట్రేల్లీస్ మాయలు.. అంటూ స్పష్టంగా 'నో' సీబీఎస్ఈ సిలబస్, అయినా జన గణమన, వందేమాతరం స్థానంలో విద్యార్థినీ విద్యార్థులకు దిమ్మతిరిగేలా ఏపీలోనే ఎక్కడ లేనివిధంగా సర్వమత ప్రార్థనలతో అన్ని వర్గాల విద్యార్థులను ఇబ్బందుల్లోకి పడేస్తున్నారని అత్యంత విశ్వసనీయ వర్గాల ద్వారా వివరించాం. దీనికి తోడు **'నో'** రిటర్న్ అడ్మిషన్ ఫీజు రూ.15 వేలు, పాఠ్య, నోటు పుస్తకాలు క్లాక్ టవర్ సమీపంలోని జ్యోతి బుక్ స్టాల్‌తో లింకు పెట్టుకుని దోపిడీకి పాల్పడుతున్నారని, అన్నీ తెలుసుకొని చర్యలు తీసుకోవాల్సిన విద్యాశాఖలోని ఆ ఉన్నతాధికారి **బంగారు మోజులో** 'అడిగినంత ఇచ్చుకోండి ఇష్టం వచ్చినట్లు చేసుకోండి' అంటూ మౌఖిక ఆదేశాలను జారీ చేసినట్లు తెలిసింది. అంతే ఇంకేముంది తమను ఎవరూ ఏమీ చేయలేరనే అహంతో.. కూటమి పార్టీలోని ముఖ్య నేతల పేర్లను కూడా వాడేస్తూ అన్ని విధాలా విద్యా దోపిడీకి పాల్పడుతున్నారని తెలిసింది. ఎక్కడ లేనివిధంగా ఈ ట్రెల్లీస్ పాఠశాలలో రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ, సెమీ రెసిడెన్షియల్ పేరుతోనూ మరింత దోపిడీకి పాల్పడుతున్నారని తెలిసింది. పాఠశాలలకు సంబంధించిన నిర్వహణ భవంతులు సైతం ఆయా సంబంధిత పంచాయతీ, మున్సిపల్ శాఖలలో ఒకలా అనుమతి తీసుకుని మరోలా ఏర్పాటుతో విద్యాసంస్థల వేర్పాటు వ్యాపారం సాగిస్తున్నారని తెలుస్తుంది.

### విద్యా శాఖలో.. ఆ బుల్లోడికి బంగారు ముడుపులా..

ఎవరెన్ని విద్యా హక్కు చట్టం నిబంధనలు ఉల్లంఘించినా.. ఇష్టం వచ్చినట్లు ఫీజులు వసూలు చేస్తున్నా.. అన్నీ తెలుసుకుని మౌనంగా ఉండేందుకు విద్యాశాఖలోని ఆ అధికారి, అదే అదే ఆ బుల్లోడికి బంగారు ముడుపులు ఇస్తే చాలట. తిమ్మిని కూడా బొమ్మిని చేయగల సమర్థుడని అదే శాఖలోని పలువురు ఉద్యోగులు 'టీ స్టాల్స్' వద్ద గుసగుసలాడుకుంటున్నారు.

### నీటి బుడగల్లా విద్యార్థి నేతలు ఆందోళనలు :

నగర పరిధిలోని ట్రేల్లిస్ లాంటి విద్యా సంస్థల వద్ద ఎందరో విద్యార్థి సంఘం నాయకులు ఆందోళనలు చేయబడుతున్నా, విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నా.. విద్యాశాఖ అధికారులకు మాత్రం చెవిటి వాడి ముందు శంఖం ఊదినట్లుగా వారి పరిస్థితి తయారైందని స్పష్టంగా తెలుస్తోంది. నిన్న, మొన్నటి వరకు శ్రీచైతన్య, ఎస్ఆర్, వివేకానంద లాంటి విద్యాసంస్థలు విద్యార్థుల తల్లి దండ్రుల నుండి భారీ ఫీజులు వసూలు చేసినా, విద్యాశాఖ అధికారి చర్యలు తీసుకోకపోవడం వెనుక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వాటికి సంబంధించిన ఆ విద్యాధికారి బంగా రు సమాచారాన్ని కూడా పాఠకులకు వివరించే ప్రయత్నం చేస్తాం.

# భాష్యం విద్యాసంస్థల్లో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

అనంతపురం, జూలై 20 అనంత సూర్య : అనంతపురం పట్టణంలో హౌసింగ్ బోర్డ్ నందు గల భాష్యం పాఠశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు కనుల



పండుగ జరిగాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ బాలకృష్ణ మాట్లాడుతూ పాఠశాల విద్యాభ్యాసం ప్రతి ఒక్కరి జీవితంలో మరువలేనిదని పాఠశాలలో పాఠశాలలో స్నేహితులు ఉపాధ్యాయులు జీవితంలో తీపి గుర్తులని వారిని జీవితకాలం గుర్తుంచుకోవాలని పాఠశాలలో మాత్రమే గురువులు దగ్గరుండి విద్యాబుద్ధులు నేర్పుతారని చిన్నతనంలోనే సంస్కారం మంచి అలవాట్లు మంచి నడవడిక నేర్చుకోవాలని ప్రతి ఒక్కరి జీవితంలో పాఠశాల విద్యాభ్యాసం పునాది లాంటిదని ఆయన పిల్లలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో చిన్నారుల నృత్య ప్రదర్శనలు చూపరులను మంత్రముగ్ధుల్ని చేశాయి. సాంస్కృతిక కార్యక్రమాల తర్వాత ఎస్పీఎల్, ఏఎస్పీఎల్, హెడ్ బాయ్, హెడ్ గర్ల్ చేత ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల చైర్మన్ రామకృష్ణ, వైస్ చైర్మన్ హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ సాకేత్రామ్, అనంతపురం జిల్లా జెడ్ఈఓ రవివర్మ, ప్రిన్సిపల్ బాలకృష్ణ, హెచ్ఎం, సిబ్బంది, విద్యార్థులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని ఉత్సాహంగా ఉల్లాసంగా నృత్య ప్రదర్శనలతో కోలాహలంగా జరుపుకున్నారు.

# హంద్రీ-నీవాపై వైసీపీ నేతలది కపట నాటకం

**- రైతులను మభ్యపెట్టే ప్రయత్నాలు మానుకోవాలి**

**- టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచపు వడ్డే వెంకటేశులు**

అనంతపురం, జూలై 20 అనంత సూర్య : హంద్రీ--నీవా సుజల స్రవంతి ప్రాజెక్టు



పేరుతో వైసీపీ నాయకులు చేస్తున్న హడావుడి పూర్తిగా రాజకీయ డ్రామా అని, అధికారంలో ఐదేళ్లు ఉన్నప్పుడు ప్రాజెక్టును పట్టించుకోకుండా ఇప్పుడు రైతులపై ప్రేమ చూపించడం కపట నాటకమేనని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచపు వడ్డే వెంకటేశులు తీవ్రస్థాయిలో విమర్శించారు. అనంతపురంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హంద్రీ--నీవా ప్రాజెక్టు రాయలసీమ రైతుల జీవనాడి అని తెలిసినా, గత వైసీపీ ప్రభుత్వం తమ పాలనలో ప్రాజెక్టు పనులను నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. కాలువల అభివృద్ధి, పెండింగ్ పనులు, నీటి పంపిణీ వ్యవస్థపై సరైన దృష్టి పెట్టకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. ఇప్పుడు వైసీపీ నాయకులు ప్రాజెక్టును పరిశీలిస్తున్నట్లు ప్రచారం చేసుకోవడం ప్రజలను మోసం చేసే ప్రయత్నమేనని విమర్శించారు. రైతుల సంక్షేమంపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు పనులు పూర్తి చేయలేదో ముందుగా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం హంద్రీ--నీవా ప్రాజెక్టు పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించిందని, పెండింగ్ పనులను వేగవంతం చేసి రాయలసీమకు సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు చేపడుతోందని తెలిపారు. ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయ విమర్శలు మానుకొని, హంద్రీ--నీవా అభివృద్ధికి సహకరించాలని వైసీపీ నాయకులకు కుంచపు వడ్డే వెంకటేశులు హితవు పలికారు. రాయలసీమ రైతుల ప్రయోజనాల విషయంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని ఆయన సూచించారు.

# పూడికతీత తీయండి... ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు !

**కమిషనర్ దృష్టికి 48వ డివిజన్ యూనిట్ ఇన్‌ఛార్జ్ మోహన్**




అనంతపురం, జులై 20 అనంత సూర్య : 30 ఏళ్ల చరిత్రలో ఏనాడూ.. ఏ నాయకుడు చేయని విధంగా ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ఆదేశాల మేరకు 48వ డివిజన్‌లో పేరుకుపోయిన నడిమివంకలో చెత్తాచెదారాన్ని ఆ డివిజన్ యూనిట్ ఇన్‌ఛార్జ్ మోహన్ కుమార్ జేసీబీల సాయంతో పూడికతీత పనులు చేపట్టారు. ఇది చేపట్టి దాదాపు నెల రోజులు కావస్తోంది. అయితే పూడికతీత వల్ల డివిజన్‌లోని బాలాజీ నగర్, రజక నగర్‌తోపాటు పరిసర ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేసినప్పటికీ.. ప్రస్తుతం గాలీవానలతో మళ్లీ ఆ పూడిక యధాస్థానానికి చేరుతోందని స్థానికులు వాపోతున్నారు. ఇదే విషయాన్ని నగరపాలక సంస్థ అధికారులకు పలుసార్లు డివిజన్ యూనిట్ ఇన్‌ఛార్జ్ మోహన్ కుమార్ చెప్పినప్పటికీ అధికారుల సమన్వయ లోపం వల్ల పూడికతీత ఎత్తివేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కావున ఇప్పటికైనా కమిషనర్ స్పందించి 48వ డివిజన్‌లోని నడిమివంక పూడికతీతను ఎత్తి-వేయాలని కోరారు. అలాగే డివిజన్‌లోని ఆర్‌కే నగర్ ప్రాంతంలో చెట్లు విపరీతంగా పెరిగి వీధిలైట్లను కప్పివేయడంతో పాటు వాహనదారులు, పాదచారులకు కూడా తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని తెలిపారు. వెంటనే చెట్ల కొమ్మలను తొలగించి, వీధిలైట్లు సక్రమంగా వెలిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ లచ్చి, భూతి ఇంచార్జ్ జావీద్ తదితరులు పాల్గొన్నారు.

# నంబులపూలకుంట మండల వ్యాప్తంగా విజయవంతంగా ముగిసిన రైతు రక్షణ యాత్ర.

నంబులపూలకుంట, జూలై 20,అనంత సూర్య ప్రతినిధి : నంబులపూలకుంట




మండల వ్యాప్తంగా దశాబ్దాలుగా సాగులో ఉన్న అర్హులైన రైతులకు వెంటనే భూ పట్టాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ రైతు రక్షణ సమితి అధ్యక్షుడు యాదల్ల రాజేష్ ఆధ్వర్యంలో చేపట్టిన రైతు రక్షణ యాత్ర సోమవారం తాటిమానుగుంత గ్రామంలో విజయవంతంగా ముగిసింది.ఈ యాత్రలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో పర్యటించి రైతులతో సమావేశమై, వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని,ఈ సందర్భంగా యాదల్ల రాజేష్ మాట్లాడుతూ, ఏళ్ల తరబడి ప్రభుత్వ భూములను సాగు చేస్తున్న అర్హులైన రైతులకు ఇప్పటికీ భూ పట్టాలు పంపిణీ చేయకపోవడం అన్యాయమని అన్నారు. పట్టాలు ఇస్తామని చెబుతూ రెవెన్యూ అధికారులు పలుమార్లు సర్వేలు నిర్వహించినప్పటికీ రైతులకు ఇప్పటివరకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు.అదేవిధంగా అనేక భూములను చుక్కలు, గయాలు భూములుగా నమోదు చేయడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.కల్తీ విత్తనాల కారణంగా రైతులు భారీగా నష్టపోతున్నారని, రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు వారి సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.రైతుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం కొనసాగిస్తే, భవిష్యత్తులో వేలాది మంది రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు,నిరసన కార్యక్రమాలు చేపట్టి రైతుల హక్కుల కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని యాదల్ల రాజేష్ హెచ్చరించారు..

# పీవీకేకేలో కృత్రిమ మేధస్సు, సైబర్ భద్రతపై శిక్షణ

అనంతపురం, జూలై 20 అనంత సూర్య : పీవీకేకే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (అటానమస్) ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో, ఐబీఎం స్కిల్‌బిల్డ్, మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్, కార్పొరేట్ రెడీనెస్ ట్రైనింగ్ సెల్ సంయుక్త సహకారంతో "కృత్రిమ మేధస్సు – సైబర్ భద్రత" అంశంపై వారం రోజుల ప్రత్యేక శిక్షణ శిబిరం సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈనెల 20 నుండి 25 వరకు నిర్వహించనున్న ఈ శిక్షణలో మూడవ సంవత్సరం ఈసీఈ విద్యార్థులకు కృత్రిమ మేధస్సు, యంత్ర అభ్యాసం, జనరేటివ్ ఏఐ, ప్రాంప్ట్ ఇంజినీరింగ్, సైబర్ భద్రత, నైతిక హ్యాకింగ్, నెట్‌వర్క్ భద్రత, డిజిటల్ రక్షణ, ఆన్‌లైన్ మోసాల నివారణ, సమాచార భద్రత వంటి అత్యాధునిక అంశాలపై నిపుణుల ద్వారా సిద్ధాంత, ప్రాయోగిక శిక్షణ అందించనున్నారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ పల్లె వెంకట కృష్ణ కిశోర్ మాట్లాడుతూ.. భవిష్యత్తు ప్రపంచాన్ని కృత్రిమ మేధస్సు, సైబర్ భద్రత రంగాలే నడిపించనున్నాయని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానంలో వేగంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను



పెంపొందించుకోవాలని సూచించారు. పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక నైపుణ్యాలను అందించేందుకు కళాశాల ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బండి రమేష్ బాబు మాట్లాడుతూ.. నేటి డిజిటల్ యుగంలో ప్రతి ఇంజినీరింగ్ విద్యార్థికి కృత్రిమ మేధస్సు, సైబర్ భద్రతపై అవగాహన అత్యంత అవసరమన్నారు. ఈ శిక్షణ ద్వారా విద్యార్థులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకోవడంతో పాటు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను కూడా సొంతం చేసుకుంటారని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల ఉద్యోగ అవకాశాలను మరింత మెరుగుపరుస్తాయని పేర్కొన్నారు. ఉప ప్రిన్సిపాల్, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ దీప్తి జోర్డానా మాట్లాడుతూ.. ఈ శిక్షణలో సిద్ధాంత బోధనతో పాటు ప్రాయోగిక తరగతులు, ప్రత్యక్ష ప్రదర్శనలు, పరిశ్రమలో ఉపయోగించే




ఆధునిక పద్ధతులపై శిక్షణ అందిస్తామని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సాంకేతికంగా మరింత ప్రతిభ కనబరచాలని కోరారు. శిక్షణ, ఉద్యోగ కల్పన విభాగం అధికారి వహీదా మాట్లాడుతూ.. ప్రపంచ స్థాయి సంస్థలతో కలిసి నిర్వహిస్తున్న ఈ శిక్షణ విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు ఉద్యోగాలకు అవసరమైన సాంకేతిక, వ్యక్తిత్వ నైపుణ్యాలను అభివృద్ధి చేస్తుందని తెలిపారు. భవిష్యత్తులో ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలు సాధించేందుకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ వారం రోజుల శిక్షణలో నిపుణులు ప్రత్యక్ష బోధనతో పాటు వివిధ ప్రాజెక్టులు, అభ్యాస కార్యక్రమాలు, సమస్యల పరిష్కార విధానాలను విద్యార్థులకు పరిచయం చేయనున్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405